ప్రజాశక్తి

బుధవారం 13 ఆగస్టు 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వర్షంతో ఊరట.!



వర్షాల కారణంగా ఉధృతంగా నెమలిగుండంలోకి ఉరకలేస్తున్న గంగ

- ఖరీఫ్ పంటలకు ప్రాణం
- జిల్లాలో పలు చోట్ల ఎడతెరిపి లేని వాన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట కలిగింది. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షం పడుతోంది. ఒంగోలులో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. జిల్లా అంతటా వర్షం పడుతోంది. వాతావరణం మారిపోయింది. నిన్నటివరకూ వర్షాలు లేవు. కరువు పరిస్థితులు వచ్చాయి. వర్షాభావం వల్ల పంటలసాగు ఆందోళనగా మారింది. ఆగస్టు నెల సగం గడుస్తున్నా ఖరీఫ్ సాగు 14 శాతం కూడా జరగలేదు. దీంతో ఈ సీజనుపై రైతులు ఆశలు వదులుకున్నారు. ఈ నెలాఖరుతో గడువు కూడా ముగియనుంది. రబీ సీజన్ మొదలుకానుంది. ఏదేమైనా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే తప్ప వర్షాలు రాలేదు. ప్రస్తుతం రైతులు పొలాలను దున్ని విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకూ 17,285 హెక్టార్లలోనే వివిధ పంటలు వేశారు. సమయం లేనందున ఖరీఫ్‌లో సాగు ▶ 2లో

బాలిక కిడ్నాప్

గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు 3లో ▲

రోజుకు 8 గంటలే పనిచేయాలి

- కార్మికుల హక్కుల సంరక్షణ బాధ్యత అధికారులదే..
- బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

8లో ▲

'వెలిగొండ' నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- ప్రాజెక్టును పూర్తి చేస్తేనే వలసల నివారణ సాధ్యం
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు



బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పీసీపల్లి, కనిగిరి

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కనిగిరి ప్రాంతంలో వలసల నివారణ కోసం, కరువు నిర్మూలించేందుకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి.. నీరు అందించడమే ఏకైక మార్గమని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా 17వ మహాసభ సందర్భంగా మంగళవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కనిగిరి ▶ 2లో

వర్షంతో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

కావాల్సిన పంటలపైనా స్పష్టత లేదు. మరో వైపు రైతులు ఇంకా పొగాకును అమ్ముకుంటూనే ఉన్నారు. వర్జీనియా పొగాకు వేలం కొనసాగుతోంది. బర్లీ పొగాకు మార్కెట్ కూడా పూర్తి కాలేదు. దీంతో రైతులు కూడా పూర్తిస్థాయిలో ఖరీఫ్‌పై దృష్టి సారించలేదు. వర్షాలు రెండు రోజులు కురిస్తే వాతావరణం మారనుంది. దుక్కులు పదునవుతాయని భావిస్తున్నారు.

ఒంగోలులో భారీ వర్షం

ఒంగోలు నగర పరిధిలోని మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. త్రోవగుంట నుంచి కిమ్స్ హాస్పిటల్ సమీపం వరకు హైవే రోడ్డులో నీరు పూర్తిగా నిలిచిపోయింది. కిమ్స్ హాస్పిటల్ వద్ద ఉన్న బ్రిడ్జి దగ్గర కూడా నీరు పోయే దారి లేక రోడ్లు వర్షపునీటితో నిండిపోయాయి.

ఉరకలేస్తున్న గుండ్లకమ్మ వాగు

రాచర్ల: గత నాలుగు రోజులుగా ఎగువనున్న నల్లమల్ల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు రాచర్ల మండలం పశ్చిమ ప్రాంత వ్యవసాయ పొలాలు కళకళ లాడుతున్నాయి.

నల్లమల అటవీ ప్రాంతం కొండల్లో కురుస్తున్న వర్షాలకు నెమలిగుండంలోకి అధికంగా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. రంగనాయక స్వామి దేవస్థానం వద్ద గల నెమలిగుండం పొంగిపొర్లి గుండ్లకమ్మ వాగు నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ రామన్న కథువలోకి నీరు అధికంగా వచ్చి చేరుతోంది.

దీంతో రామన్న కథ కూడా పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతూ దాని అనుసంధాలుగా ఉన్న వాగులు ప్రవహిస్తున్నాయి. వీటి ప్రవాహంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పరిసర కుంటలు, చెరువులు నిండినట్లయితే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత బాగా లభిస్తుందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'వెలిగొండ' నిర్మాణానికి

రూ.2 వేల కోట్లు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంత వాసులు పనుల కోసం దేశం నలుమూలలతో పాటు ప్రపంచవ్యాప్తంగా వెళుతున్నారని అన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య కాలంలో కనీసం కనిగిరి ప్రాంతంలో వారికి గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేకపోయారని ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. 23 సంవత్సరాల నాడు వెలిగొండ ప్రాజెక్టును నిర్మాణం పనులు ప్రారంభించినా.. నేటికీ పూర్తిచేయకపోవడం శోచనీయమని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తే లక్ష ఎకరాల్లో సాగులోకి వస్తుందన్నారు. 5 లక్షల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత గల ప్రాజెక్టును పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వుందన్నారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ పునర్విభజన చట్టం 2013 ప్రకారం 13 జిల్లాల్లో ఏడు జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా ఉన్నాయన్నారు.

వాటిలో ప్రకాశం జిల్లా ఒకటని తెలిపారు. కానీ ప్రకాశం జిల్లా వెనుకబాటుతనాన్ని నిర్మూలించేందుకు ఎలాంటి నిధుల కేటాయింపులు లేవని పేర్కొన్నారు. జిల్లా మొత్తం మీద 39 మండలాలకు గానూ కేవలం 13 మండలాల్లో మాత్రమే నికరజలాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా అభివద్ధికి పాలకులు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పేదలకు భూములు పంచాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలన్నారు. ముందుగా వైఎస్సార్ రోడ్, చెప్పుల బజార్ మీదుగా క్లబ్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు హనీఫ్, నాయకులు పీసీ కేశవరావు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, వృత్తిదారుల సంఘం నాయకులు రాయళ్ళ మాలకొండయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు పిల్లి తిప్పారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు మహేష్ పాల్గొన్నారు.



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

పెట్రోల్ బంకు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని కాలేజి రోడ్డులో గల సౌజన్య ఫంక్షన్ హాలు సమీపంలోని పెట్రోల్ బంకును మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ పంపులో రీడింగ్, పెట్రోల్, డీజిల్ నాణ్యత, కొలతలు వంటివి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బంకు నిర్వహించని పక్షంలో సీజ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఏఓ పావని

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పి.గుడిపాడు, కామేపల్లివారిపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి పావని మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం పంటలు సాగుచేసిన రైతులందరూ రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నువ్వుల పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించిన రైతులు అదే పంటపై ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్ వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శృతి, దివ్య ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలంలోని కాశికుంట తండాలో మంగళవారం వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కే నీరజ మాట్లాడుతూ గ్రామంలోని పంటల సాగు వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట వేసే ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం గురించి వివరించారు. రైతులు ఈ పథకంలో తప్పనిసరిగా భాగస్వామ్యులు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండలంలోని చింతల అగ్రహారం, కటాకనిపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ పాల్గొన్నారు. రైతులకు పత్తి పంట సాగు విధానం, ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహనా కల్పించారు. మండల వ్యవసాయ అధికారి డి జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు.

అర్ధవీడు: అర్ధవీడు మండలంలోని పెద్ద కందుకూరు, అయ్యవారిపల్లి గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి శివగంగ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 14 వరకు పంటల బీమా లకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో హెచ్ఈఓ శేషగిరి మాట్లాడు తూ ఉద్యానవన శాఖలో ఉన్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఉద్యానవన సహాయ అధికారి రంగనాయకులు, వెటర్నరీ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అర్ధవీడు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

కొమరోలు నుంచి

హైదరాబాదుకు బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-కొమరోలు



కొమరోలు మండల ప్రజలకు గిద్దలూరు ఆర్‌టీసీ డిపో మేనేజర్ శుభవార్త తెలిపారు. కొమరోలు నుంచి బస్సులో నేరుగా హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయాణికులకు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజూ కొమరోలు నుంచి హైదరాబాదులోని బిహెచ్ఇఎల్ వరకు వెళ్లేందుకు బస్సు గిద్దలూరు నుంచి రాజుపాలెం ఎడమకల్లు మీదుగా రాత్రి 8.45 నిమిషాలకు కొమరోలుకు చేరి తరువాత కొమరోలు నుంచి తాటిచెర్ల మోటు, బేస్తవారిపేట, కంభం, కుంట, ఎర్రగొండపాలెం, సాగర్ మీదుగా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు హైదరాబాదుకు చేరుకుంటుందని ఆయన తెలిపారు ఈ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని గిద్దలూరు డిపో మేనేజర్ ప్రయాణికులకు తెలిపారు.

బాలిక కిడ్నాప్..

గంటల వ్యవధిలోనే కేసు ఛేదించిన పోలీసులు

స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-రాచర్ల


కిడ్నాప్‌నకు గురైన బాలిక

కిడ్నాప్‌నకు గురైన బాలికను పోలీసులు అప్రమత్తమై గంటల వ్యవధిలో రక్షించారు. రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల మూడమంచు అంజలి మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో ఉండగా మీ నాన్న పిలుస్తున్నారు అంటూ ఓ వ్యక్తి బాలికను కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. కూతురు కనిపించక పోవటంతో అంజలి తల్లిదం డ్రులైన పాపయ్య, రాజేశ్వరి దంపతులు 10.30 గంటల సమయంలో రాచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాచర్ల పోలీసులు వెంటనే ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేయగా, క్షణాల్లో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రం గంలోకి దిగారు. ఎస్పీ ఈ కిడ్నాప్‌ను అత్యంత తీవ్రంగా పరిగణించి, తక్షణమే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కర్నూలు, కడప, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాల ఎస్పీ లకు కూడా సమాచారం అందించి అప్రమత్తం చేశారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను అప్రమత్తం చేసి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు అప్రమత్తం కావడంతో కిడ్నాపర్లు భయపడి బాలికను పెద్దారవీడు మండలం దేవరాజు గట్టు వద్ద వదిలి పారిపోయారు. బాలికను గుర్తించిన పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ సకాలంలో పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల త్వరితగతిన చర్యలు తీసుకొని అంజలిని కాపాడగలిగామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అంజలిని కిడ్నాప్ చేసిన దుండగులను పట్టుకోవడానికి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. బాలికను రక్షించిన పోలీసు యంత్రాంగానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన మార్కాపురం డిఎస్పీ యు.నాగరాజు, గిద్దలూరు రూరల్ సిఐ జె.రామకోటయ్య, రాచర్ల ఎస్ఐ కోటేశ్వరరావు, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

8 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పొదిలి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మీ నారాయణ

అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించారు. ఈ ముఠాలో కీలకమైన నెల్లూరు జిల్లా కావలి పట్టణం శాంతినగర్‌కు చెందిన కలికి సాయికుమార్ రెడ్డి తాత్కాలికంగా చిన్న చెరువు వద్ద నివాసం ఉంటూ గత ఏడాదికాలంగా ఈ ముఠాను నడిపిస్తున్నాడు. భారీగా విక్రయాలు సాగిస్తున్నాడు. సాయి కుమార్ రెడ్డితో పాటు బీహార్‌కు చెందిన బిక్రమ్ కుమార్, సుజిత్ కుమార్, పవన్ కుమార్, దీపు కుమార్, కొమరోలు మండలం మోటు గ్రామానికి చెందిన కోలా బాబురావు అలియాస్ చినబాబులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 8.065 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన సుజిత్ కుమార్ పొదిలి నగర పంచాయతీలోని పోతవరంలో కోటి అనే రైతు ఆవుల షెడ్డులో పనిచేస్తూ శశి కుమార్ రెడ్డికి పరిచయమయ్యాడు. ఎక్కువ మొత్తంలో గంజాయి కావాలని సాయి కుమార్ రెడ్డి సుజిత్ కుమార్‌కు తెలుపగా అతడు తన సమీప గ్రామానికి చెందిన విక్రమ్ కుమార్‌కు ఫోన్ చేసి గంజాయి తెప్పించే వాడు. ఇలా తెచ్చిన గంజాయిని సాయి కుమార్ రెడ్డి పొదిలి ప్రాంతంతో పాటు కొమరోలు మండలం చెందిన బాబురావుకు కూడా విక్రయించేవాడు. ఈ మధ్య కాలంలో శుభకార్యాలు ఎక్కువగా జరుగుతూ ఉండడంతో అత్యధిక మొత్తంలో గంజాయి కావాలని సాయికుమార్ రెడ్డి కోరడంతో సుజిత్ కుమార్ విక్రమ్ కుమార్‌తో అత్యధిక మొత్తంలో గంజాయిని తెప్పించారు. విక్రమ్ కుమార్ ఒరిస్సాలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద భారీగా కొనుగోలు చేసి దానిని ఒక్కడే తీసుకురాలేక తన స్నేహితులైన సుజిత్ కుమార్, దీపు కుమార్, పవన్ కుమార్‌లను వెంటబెట్టుకుని మంగళవారం చిన్న చెరువు ఎస్టీ కాలనీ వద్ద సాయికుమార్ రెడ్డి ఇంటి వద్ద విక్రయాలు సాగిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పొదిలి పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితులను కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ అక్రమంగా గంజాయి విక్రయించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన దర్శి డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ, పొదిలి సిఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై వి.వేమన, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు గౌతమ్, శివారెడ్డి, పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

క్రైమ్ కాలమ్

క్వారీలో ప్రమాదం.. కార్మికుడు మృతి

ప్రజాశక్తి-బల్లికురవ


మృతి చెందిన కశ్యప్

గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన స్థానిక సనకొండ వెంకట సాయి కంకర క్వారీలో జరిగింది. బల్లికురవ ఎస్ఐ నాగరాజు కథనం ప్రకారం.. ఒరిస్సాకు చెందిన సాధు రామ్ కశ్యప్ (32) వెంకట సాయి కంకర క్వారీలో పనిచేస్తున్నాడు. క్వారీ ఎగువ భాగంలో జాకీ పట్టే క్రమంలో జారి రాళ్లపై పడి దుర్మరణం చెందాడు. మృతుడు అవివాహితుడు. వీఆర్వో ముసలయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు యాజమాన్యంపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చూరి వైద్యశాలకు తరలించారు. కాగా ఈ నెల 3న జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన సంఘటన మరువక ముందే ఇలా జరగడం విశేషం.

రైలు కిందపడి వృద్ధురాలు మృతి


ప్రజాశక్తి-సింగరాయకొండ


వృద్ధురాలిని బయటకు తీస్తున్న దృశ్యం

రైలు కింద పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సింగరాయ కొండ రైల్వే స్టేషన్‌లో జరిగింది. కందుకూరు మండలం విక్కిరాల పేటకు చెందిన యొక్కటిల్లి లక్ష్మమ్మ(94) స్టేషన్లో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాం మీద కూర్చుంది. తిరుపతి నుంచి ఆదిలాబాదుకు వెళుతున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ సింగరాయకొండ స్టేషన్‌లో ఆగుతుండగా మూడో బోగీ మధ్యలో వృద్ధురాలు దూరింది. రైలు డ్రైవరు వెంటనే రైలును నిలిపి లక్ష్మమ్మను కాపాడే ప్రయత్నం చేశారు. ఆమె అప్పటికే పట్టాల మీద పడి మృతి చెందింది. దీంతో రైలు 45 నిమిషాల పాటు నిలిచింది. రైల్వే పోలీసులు ఆమె వద్ద ఉన్న ఫోను ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఉరేసుకొని 'క్విస్' విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్


విద్యార్థి మృతదేహం

ఒంగోలు క్విస్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు పట్టణంలోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థి ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ గది నుంచి దుర్వాసన రావడంతో గమనించిన కొందరు విద్యార్థులు హాస్టల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మృతి చెందిన విద్యార్థి నెల్లూరు జిల్లా కందుకూరు మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన భాస్కర్‌గా గుర్తించారు. ఈ విద్యార్థి గతంలో ఉత్తరాదిన ఉన్న ఒక రాష్ట్రంలో రెండు సంవత్సరాల పాటు ఇంజనీరింగ్ చదివి మధ్యలో చదువు ఆపేసి క్విస్ కాలేజీలో మొదటి సంవత్సరం నుంచి చదువుతున్నాడని చెబుతున్నారు. గతంలో ఇంజనీరింగ్ చదివిన సందర్భంలో ఏర్పడిన వివాదాల నేపథ్యంలోనే మనస్పర్ధకు లోనై ఆత్మహత్యకు పాల్పడి వుండవచ్చని భావిస్తున్నారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని అంటున్నారు. ఒంగోలు తాలూకా యస్.ఐ ఫిరోజ్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ కళాశాలలో గతంలో ఇటువంటి సంఘటనలు అనేకం జరగటం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు

అదుపుతప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి-చీరాల


బోల్తా పడిన లారీ

లారీ అదుపు తప్పి కాలువలో బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానిక మన్నం అపార్ట్‌మెంట్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కలకత్తా నుంచి చెన్నైకి పైపులు, కరెంటు సామాన్ల లోడుతో వెళ్తున్న లారీ ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి నిద్ర మత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపు తప్పి రహదారి పక్కన కాలువలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఉగ్ర - 250 ట్రాక్టర్లతో రైతుల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి-కనిగిరి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర


ట్రాక్టర్లతో సాగుతున్న ర్యాలీ

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి పట్టణంలో అన్నదాత సుఖీభవ రైతు సంబర సభను మంగళవారం నిర్వహించారు. 250 ట్రాక్టర్లతో పండుగ వాతావరణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే ట్రాక్టర్‌ను నడిపి ర్యాలీని ప్రారంభించారు. అమరావతి గ్రౌండ్స్ నుంచి ట్రాక్టర్లతో ప్రారంభమైన భారీ ర్యాలీ చర్చి సెంటర్, ఒంగోలు బస్టాండ్ చేరుకోగా అక్కడ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత చెక్ పోస్ట్ మీదుగా ఏఎంసికి చేరుకుంది. సభను ఉద్దేశించి ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో 49,981 మంది రైతులకు 83.96 కోట్లు కాగా మొదటి విడతలో 28.38 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. రైతులకు సబ్సిడీపై డ్రోన్లు, యంత్రాలు, యంత్ర పరికరాలు ఇచ్చి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సీఎం చంద్రబాబు చేసిన మంచి పనికి రైతులు ఇంత భారీగా తరలి వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తల సమైక్య కృషితోనే మనం అధికారంలోకి వచ్చామనీ యువగళం సారథి నారా లోకేష్ వేసిన మార్గంలో మనం ముందుకు వెళ్లి ప్రజల్లోకి వెళ్దాం అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా కనిగిరిలో టీడీపీ జెండా ఎగరాలనీ అందుకు ఇప్పటి నుంచే అందరం కష్టపడదామని పిలుపునిచ్చారు. మీకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ షేక్ జైనులాబ్దిన్, ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, యూత్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ అహ్మద్, మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాస్ రెడ్డి, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, పచ్చవ వెంకటేశ్వర్లు, బాలు ఓబుల్ రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుదురుపాటి సుబ్బయ్య, మాలపాటి ఓబుల్ రెడ్డి, నంబుల కొండయ్య, తమ్మినేని సురేంద్ర, అచ్చాల రవి, ఆరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

యువతికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలం మూగచింతలలో అన్నదమ్ముల మధ్య ఆస్తివాదంలో జరిగిన ఘర్షణలో ఒక యువతికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన నల్లబోతుల సుబ్బారావు, నల్లబోతుల శ్రీనివాసులు, నల్లబోతుల నాగేశ్వరరావు, పోలయ్య, చెంచ రామయ్య పోలయ్యలు అన్నదమ్ములు. వీరికి కుటుంబ వారసత్వంగా వచ్చిన స్థలంలో నల్లబోతుల సుబ్బారావు, శ్రీనుకు హక్కు పత్రాలు ఉన్నాయి. ఈ విషయం గమనించిన వారి సోదరులు నాగేశ్వరరావు, పోలయ్య, చెంచురామయ్యలు తమకు ఇంటి స్థలంలో హక్కు కావాలంటూ గొడవ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నల్లబోతుల నాగేశ్వరరావు చెంచురామయ్యలు నల్లబోతుల సుబ్బారావు శ్రీను కుటుంబంపై దాడి చేశారు. గాయాలైన సుబ్బారావు, శ్రీను కుటుంబ సభ్యులు పొదిలి స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు, చెంచు రామయ్యలు మాపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ గొడ్డలి, కర్రలతో దాడిచేయగా నల్లబోతుల శ్రీనివాసులు కుమార్తె ప్రవలికకి తలపై బలమైన గాయమైంది. 108లో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

పులి దాడిలో గేదె మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్ : పులి దాడిలో గేదె మృతి చెందిన సంఘటన గిద్దలూరు మండలం ఎల్లుపల్లె గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. మోడి కొత్త చిన్న రంగస్వామికి చెందిన చూడి గేదె పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. రెండు రోజులు గడిచినా గేదె ఇంటికి తిరిగి రాకపోవడంతో రైతు రంగస్వామి మంగళవారం పొలాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. నల్లమల అటవీ ప్రాంత సమీపంలో గల జామాయిల్ తోటలో గేదె మృతి చెంది ఉంది. పరిసర ప్రాంతంలో పరిశీలించగా పులి అడుగులు కనిపించాయి. దాదాపు రూ.80 వేలు విలువైన గేదె మృతితో రంగస్వామి కుటుంబం బోరున విలపించింది. ఈ కార్యక్రమంలో గుండ్లకమ్మ రేంజ్ ఎఫ్ఆర్ఓ కృష్ణకుమారి, అటవీ శాఖ సిబ్బంది, ఎల్లుపల్లె పశువైద్యాధికారి గజ్జలకొండ వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఏరువ రాజశేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం గుడి మెట్ట రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం గుంటూరు నుంచి డోన్‌కు వెళ్లే ప్యాసింజర్ ట్రైన్ నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని, తెలిసిన వారు గిద్దలూరు ఆర్పీఎఫ్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

'డెంగీ' బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య
- వైద్యశాలలో రోగులకు పరామర్శ

ప్రజాశక్తి-బాపట్ల

డెంగీ జ్వర బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య వైద్యాధికారులను కోరారు. బాపట్ల పట్టణంలోని ఏరియా వైద్యశాలను గంగయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డెంగీ జ్వరంతో బాధపడుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తో మాట్లాడారు. డెంగీ జ్వరం పీడితులు నివాసం ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్యం నిర్వహించే విధంగా అన్ని శాఖలను సమన్వయం చేసే విధంగా కృషి చేయాలన్నారు. నగరం మండలంలో డెంగీ జ్వరాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, వార్డు సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది సమన్వయంతో డెంగీ జర్వాలు వచ్చిన ప్రాంతాల్లో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ జ్వరంతో ఆసుపత్రికి వస్తే వారికి తక్షణమే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రక్త పరీక్షలు నిర్వహిస్తేనే డెంగీ లక్షణాలు బయటపడతాయన్నారు. అందుకు ఆసుపత్రిలో అన్ని విభాగాల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. రక్త పరీక్షల్లో డెంగీగా నిర్ధారణ అయితే అవసరమైన వైద్యం అందించేందుకు అన్ని రకాల మందులు వైద్యశాలలో అందుబాటులో ఉంచామన్నారు. రక్త పరీక్షలు స్థాయిలోనే ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరం మండలంలో డెంగీ జ్వరాల పై ఎప్పటికప్పుడు తమకు వైద్య సిబ్బంది రిపోర్టు అందిస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ప్రస్తుత తరుణంలో డెంగీ జ్వరాలు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. డెంగీ జ్వరపీడితులను పరామర్శించిన వారిలో సిఐటియు నాయకుడు కె. శరత్ ఉన్నారు.


జ్వర పీడితుడిని పరామర్శిస్తున్న సిహెచ్. గంగయ్య


వైద్యశాల సూపరిండెంటెండ్‌తో మాట్లాడుతున్న గంగయ్య

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఆగడాలను అరికట్టాలి

సిఐకి బాధితుల వినతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలతోపై ఎక్కువ అయ్యాయని, రెక్కల కష్టం మొత్తం కిస్తీలు రూపంలో చెల్లిస్తున్న, అధిక వడ్డీలు వసూలు చేస్తూ తమన్న ఇబ్బంది పెడుతున్నారని పంగులూరు మండలంలోని బైట మంజులూరు, భగవాన్ రాజుపాలెం గ్రామాలకు చెందిన బాధితులు అద్దంకి రూరల్ సిఐ డి. మల్లికార్జునరావు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మేదరమెట్లలోని అద్దంకి రూరల్ సిఐ కార్యాలయంలో సిఐ మంగళవారం కలిసి సమస్యను విన్నవించుకున్నారు. వ్యవసాయ పనుల కోసం, పిల్లల చదువులు కోసం, ఇతర కుటుంబ అవసరాల కోసం ఇళ్లను తాకట్టు పెట్టి ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల దగ్గర అప్పులు తీసుకున్నట్లు తెలిపారు. అప్పులు తీర్చేందుకు రెక్కల కష్టంతో నెల నెల కిస్తీలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యం బాగాలేకనో, మరో ఇతర కారణాల చేతకొద్దిపాటి కిస్తీలు చెల్లించకపోతే ఈ ఇల్లు తాకట్టులో ఉందని, ఎవరికి ఇల్లు కొనే హక్కు లేదని బోర్డులు పెడుతున్నటుల తెలిపారు. దీంతో గ్రామంలో కానీ, బయట కానీ, బంధువుల దగ్గర అప్పులు పుట్టటం లేదన్నారు. దీని వల్ల మానసిక హింసలు పడుతున్నామని చెప్పారు. ఆరు నెలల క్రితం బైట మంజులూరులో మూడు నెలల కిస్తీ కట్టలేదని ఇంట్లో ఆడవాళ్ళను బయటకు లాగి, ఇంటికి తాళం వేసి సీలు వేశారని, మరో వ్యక్తి జేబులో ఉన్న సెల్ ఫోన్ తీసుకొని పోయారని, ఇప్పుడు భగవాన్ రాజుపాలెంలోని చింతలచెరువు సామ్రాజ్యం ఫోర్ వీల్ ఆటోను తీసుకుపోయారన్నారు.ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు మొండ్రు ఆంజనేయులు, పంగులూరు మండల కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు ఈ ప్రాంతంలో పేదల అవసరాలను ఆసరాగా తీసుకొని, వారి స్థితిగతులను కూడా గమనించకుండా లక్ష రూపాయలు అప్పులు ఇచ్చారని తెలిపారు. బాకీలు రాబట్టుకునేందుకు వారిని అనేక ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. కూలి పనుల మీద ఆధారపడి జీవించే పేదలు నెలకు రూ.10 ,రూ.15 వేల రూపాయలు చెల్లించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. అధిక వడ్డీలను పేదలపై మోపుతూ వారిని ఇబ్బందులు పెడుతున్న ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బడుగు రూపేష్, బైట మంజులూరు,భగవాన్‌రాజుపాలెంబాధితులు పాల్గొన్నారు.



సిఐ తో మాట్లాడుతున్న బాధితులు

సిపిఎం నాయకులు సత్యమూర్తి మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల, చీరాల

కామ్రేడ్ సత్యమూర్తి మృతి కార్మికోద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని సిపిఎం కోరిశపాడు మండల కార్యదర్శి ఎం. ఆంజనేయులు, సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎన్. బాబూరావు, నాయకులు తెలిపారు. చీరాల ఐఎల్‌టిడిలో గత 25 ఏళ్లుగా సాధారణ కార్మికుడిగా సేవలందిస్తూ, ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ సిఐటియు కార్యకర్తగా, నాయకుడిగా గుర్తింపు పొందిన సత్యమూర్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు మంగళవారం అకాల మరణం చెందినట్లు తెలిపారు. కోరిశపాడు మండలం కుర్రవాని పాలెం గ్రామంలో జన్మించిన సత్యమూర్తి, ఐఎల్‌టిడిలో చేరిన నాటి నుంచి చీరాల కార్మికోద్యమంతో మమేక మయ్యారన్నారు. విధుల అనంతరం సమయాన్ని మొత్తం ఉద్యమానికి అంకితం చేస్తూ అన్ని తరగతుల కార్మికులతో మమేకమై పోరాటాల్లో ముందుండేవారని తెలిపారు. తన స్వగ్రామం సహా కోరిశపాడు మండలంలో ప్రజాతంత్ర ఉద్యమ అభివద్ధికి కూడా నిరంతరం కృసి చేశారన్నారు. చీరాలలో జరిగిన ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని సహచర కార్యకర్తలకు ఉత్తేజాన్ని నింపివారని తెలిపారు.


కామ్రేడ్ సత్యమూరి (ఫైల్)

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - కొల్లూరు

కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైనట్లు సిపిఎం మండల కమిటీ సభ్యులు బొనిగల సుబ్బారావు తెలిపారు. హామీలు అమలు చేయాలని కోరుతూ మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వల్లే ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారాన్ని ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తుందన్నారు. ఈపూర్ టు తెనాలి వయా అనంతవరం ఆర్ అండ్ బి రోడ్డు చాలా అధ్వానంగా ఉందన్నారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వ హయాంలో అధికారులు దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు గడుస్తున్న ఈ రోడ్డుని గురించి పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతవరం గ్రామ వైస్ ప్రెసిడెంట్ బూసి , ధూళిపాల రవి ,గొల్ల రాంబాబు, వెంకటేశ్వరరావు, మున్నంగి శ్రీనివాసరావు ,అశ్విని కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు


ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు రియల్‌టైమ్ అప్లికేషన్స్‌పై రెండు రోజులుగా నిర్వహించిన వర్క్‌షాపు మంగళవారంతో ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో రియల్ టైమ్ అప్లికేషన్స్‌పై రెండు రోజులుగా వర్క్‌షాపు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. జగదీష్ బాబు తెలిపారు. ఈ వర్క్‌షాపులో సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి వివిధ రంగాల్లో నిపుణులైన అధ్యాపకులు , రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసే ఇంజినీరింగ్ నిపుణులు రియల్ టైమ్ అప్లికేషన్స్‌పై అవగాహన కల్పించినట్లు సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి టి. కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డ్రైనేజి డిపార్ట్‌మెంట్ వారితో కళాశాలకు అవగాహన ఒప్పందం కుదిరినట్లు ఆయన తెలిపారు. రెండో రోజు వర్క్‌షాపులో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధి పి. కిషోర్ కుమార్ రెడ్డి విద్యార్థులకు కోస్టల్ ఎరోజన్ ప్రివెంక్షన్ పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజి ప్రతినిధి జి.శ్రీనివాసుల రెడ్డి, క్వాలిటీ ఎస్యూరెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి తెలిపారు. ఈ వర్క్‌షాపులో సి.సుబ్బారావు, సివిల్ ఇంజినీంగ్ విభాగం అధ్యాపకులు బిటెక్ ద్వితీయ తృతీయ, నాల్గవ సంవత్సరం విద్యార్థులు, పోగ్రాం కన్వీనర్ జి. విజయ్ కుమార్, కో ఆర్డినేటర్ ఎస్.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగ మస్టర్లపై డ్వామా ఏపీడీ విచారణ

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండల పరిధిలోని అడవి పాలెం గ్రామంలో ఉపాధి హామీ పనుల దొంగ మస్టర్లపై సచివాలయంలో మంగళవారం విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా డ్వామా ఏపీడీ కోటానాయక్ మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా తాను విచారణ చేపట్టినట్లు కోటా నాయక్ తెలిపారు. ఉపాధి హామీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఫీల్డ్ అసిస్టెంట్ రాజా ఏపీడికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిండు హనుమంతరావు. ఎన్ఎస్‌పి డిసి చైర్మన్ కామను శ్రీనివాసరావు, వెల్లల చెరువు సొసైటీ అధ్యక్షుడు బెల్లంకొండ ఏడుకొండలు. ఏపీవో బాలకష్ణ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజా, గ్రామ పంచాయతి కార్యదర్శి రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి-అద్దంకి

తమ సమస్యలు పరిష్కరించాలని కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్దంకి అధ్యాపకులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మంగళవారం నిరసన తెలిపారు. బదిలీలు నిర్వహించాలని, జీవో నెం 42 రద్దు చేయాలని, దేశంలోని 26 రాష్ట్రాల్లోఅసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌లుగా రీడిగ్నేట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించక పోతే ఈ నెల 18న విజయవాడలోని అలంకార్ సెంటర్ లో రాష్ట్ర స్థాయిలో మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సిహెచ్. సురేష్ కుమార్, డాక్టర్ ఎ.అశోక్ కుమార్, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం..

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

పరిశుభ్రతతోనే విద్యార్థుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో మంగళవారం జరిగింది. చేతుల పరిశుభ్రంగా కడుక్కోవటంపై విద్యార్థుల ప్రదర్శన, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై ముఖ్య ప్రదర్శనలు విద్యార్థులను అంతగానో అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను కలెక్టర్ అందజేశారు. బాల్య దశలో ఆరోగ్యంగా విద్యార్థులు ఉండాలంటే మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా నులిపురుగుల మందులు వాడాలని కలెక్టర్ చెప్పారు. విద్యార్థుల మంచి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రత్న మన్మోహన్, ఆర్.బి.ఎస్.కె పీవో డాక్టర్ లలితా రాజేశ్వరి, డి సి డాక్టర్ ప్రవీణ్, డిపిఎమ్ఓ డాక్టర్ మనోజ్, డాక్టర్ మౌనిక, డిప్యూటీ డెమో బి.మరియమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడటంలో వ్యక్తిగత పరిశుభ్రత కీలకం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆరోగ్యాన్ని కాపాడుకోవ డానికి వ్యక్తిగత, పరిసరాల శుభ్రత అత్యంత కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యాధికారులు వేశారు. ముఖ్యఅతిథిగా డిఆర్ఓ మాట్లాడుతూ నులిపురుగుల బారినపడితే రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గటం.. వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు మధ్య 5,96,751 ఉన్నట్లు తెలిపారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా వీరికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు మాత్రలు వేయించుకోలేని వారికి ఈ నెల 20న మాత్రలు వేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఈ సందర్భంగా డిఆర్ఓ, డి.ఎం.హెచ్.ఓ., ఇతర అధికారులు స్వయంగా ఆల్బెండాజోల్ టాబ్లెట్లను వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వాణిశ్రీ, జిల్లా క్షయ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి శ్రీవాణి, డిఐఓ డాక్టర్ కమలశ్రీ, డిపిఎమ్ఓ సౌజన్య, ఆర్బిఎస్కె డిపిఓ భగీరధి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఆర్ఐఓ ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తేవాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ

అధికారులందరూ నిబద్ధతతో, నిజాయితీతో విధులు నిర్వహించి డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లుగా, ఇన్‌స్పెక్టర్లుగా, సబ్ ఇన్స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి ఒంగోలు పోలీస్ కళాశాలలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 101 మందికి మంగళవారం నాడు వీడ్కోలు సభ ఒంగోలు పోలీస్ కళాశాల నందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా ఒంగోలు పోలీసు శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ జి.ఆర్.రాధిక హాజరయ్యారు. వీరితో పాటు కార్యక్రమానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఒంగోలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె.ఆయేషా బేగం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు శిక్షణా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి.లక్ష్మణ్ కుమార్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

- సిసిఆర్‌సి కార్డుల జారీకి ప్రత్యేక డ్రైవ్
- అధికారులకు జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. సిసిఆర్‌సి కార్డుల మంజురుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిజమైన కౌలు రైతులకు ఈ కార్డులు మంజూరు లక్ష్యాలను సాధించాలని ఆయన తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికార్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జెసి ఆర్.గోపాలకృష్ణ రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై.. ఎరువుల సరఫరా, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ, హౌసింగ్ ఫర్ ఆల్‌లో ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తుల పెండెన్సి, ఇంటి పట్టాల రీవెరిఫికేషన్ ప్రక్రియ, రీ సర్వే పురోగతి, కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డుల మంజూరు, నిత్యావసర సరుకుల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వీడియో సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, డిఎస్ఓ ఎస్.పద్మశ్రీ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్‌బాషా పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ

ప్రతి ఒక్కరిలో ముఖ్యంగా యువతలో దేశ భక్తిని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జిల్లాఅంతటా ఘనంగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ అన్నారు. ఒంగోలులోని ఎన్టిఆర్ కళాపరిషత్ భవనంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశభక్తిని పెంపొందించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసు, ఆర్‌డిఓ లక్ష్మీప్రసన్న, మెప్మా పిడి శ్రీహరి పాల్గొన్నారు.

19న ఆటో కార్మికుల మహాసభలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న తంబి శ్రీనివాసులు

ఆంధ్రప్రదేశ్ ఆటో వర్కర్స్ అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూని యన్ ఆధ్వర్యంలో ఆగస్టు 19న ఒంగోలు నగరంలో నిర్వహించ నున్న మహాసభను విజయ వంతం చేయాలని యూనియన్ నాయకులు తంబి శ్రీనివాసులు కోరారు. మంగళవారం నాడు యూనియన్ నగర కమిటీ సమావేశం నగర కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 21ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్రీ బస్సు ప్రయాణ పథకంతో ఆటో కార్మికుల ఆదాయాలు భారీగా తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ నష్టాన్ని పూడ్చేందుకు ఆటో కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.5000 భతి మంజూరు చేయాలని, ఆటో మిత్ర పథకంలో డ్రైవర్‌కు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు నగరంలో సరైన ఆటో స్టాండ్లు లేకపోవడం, ట్రాఫిక్ పోలీసులు ఫైన్లు విధించడం, ఆటోలను స్టేషన్లకు తరలించడం వంటి చర్యలు కార్మికులను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నాయని చెప్పారు. ఈ విధానాన్ని యూనియన్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు., 24న జరిగే రాష్ట్రస్థాయి మహాసభలో సమష్టిగా పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని సూచించారు. నగర స్థాయి మహాసభ విజయవంతం కావడం ద్వారానే రాష్ట్రస్థాయి డిమాండ్లకు బలం చేకూరుతుందని తెలిపారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు సింగయ్య, కోటేశ్వరరావు, దాసరి రమేష్, సుబ్బారావు, ఎండి బేగ్ పాల్గొన్నారు.

ఏ.కే.యూ.లో స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆంధ్ర కేసరి యూనివర్సిటీని సిద్ధం చేస్తూ మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. నిర్మలామణి క్యాంపస్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది జాతీయ జెండాలతో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నిర్మలామణి, యువతరం దేశ అభివద్ధి, సంక్షేమానికి కషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్‌కుమార్ ప్రత్యేక సందేశం అందించారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ ఏ.భారతీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యకాసం జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి-పీసీపల్లి, కనిగిరి



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మహాసభల సందర్భంగా ప్రదర్శన

వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా 17వ మహాసభలు కనిగిరిలోని సునీల్ చోప్రా నగర్‌లో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలుత సంఘం జెండాను వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, పట్టపు ప్రకాశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధులలో కోత పెడుతోందన్నారు. దీని వల్ల కూలీలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మరింతగా కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ కార్మికుల సంఖ్య పెరుగుతోందన్నారు. అదే సందర్భంలో పని దినాలు తగ్గిపోతున్నాయన్నారు. గతంలో వరి రెండు లక్షల ఎకరాల్లో సాగు చేసేవారని తెలిపారు. గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడులు అధికమై సాగు తగ్గిందన్నారు. ప్రస్తుతం లక్ష ఎకరాలకే వరి సాగు చేస్తున్నారన్నారు. లక్ష యాభై వేల ఎకరాల్లో గతంలో మిర్చి సాగుచేయగా.. ఈ సంవత్సరం కేవలం 55 వేల ఎకరాలకు పరిమితం అయ్యిందన్నారు. అందువల్ల వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. 17వ మహాసభల అధ్యక్ష వర్గంగా నెరుసుల వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, మల్లెల సంపూర్ణ వ్యవహరించారు. గత మూడు సంవత్సరాల కాలంగా వ్యవసాయ కార్మిక సంఘంలో ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ మరణించిన వారి సంతాప తీర్మానాన్ని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ మస్తాన్ ప్రవేశపెట్టారు. మహాసభల్లో కార్యదర్శులు వేదికను జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రవేశ పెట్టారు. మహాసభల్లో ఉబ్బ వెంక టేశ్వర్లు, గుమ్మ బాలనాగయ్య, ఊస వెంకటేశ్వర్లు, బడుగు వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు, కే మాల్యాద్రి పాల్గొన్నారు. వ్యవసాయ కార్మికులకు సంఘీభావంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఈ బాలకోటయ్య ప్రసంగించారు.

జీవో ప్రతులు దహనం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి విద్యార్థి, ప్రజా సంఘాల ప్రవేశానికి అనుమతులు లేకుండా ఆగస్టు 1న విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం భాగ్యనగర్ కూడలిలో విద్యార్థులతో కలిసి వివాదాస్పద జీవోల ప్రతులను దహనం చేశారు. జీవో రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ రాష్ట్ర నాయకులు సిహెచ్. సిసింద్రీ బాబు, మోషే, విల్సన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి- అద్దంకి

యువత మాదకద్రవ్యాలకు బానిసలైతే తమ అమూల్యమైన జీవితాన్ని కోల్పో యే ప్రమాదముందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బివి.సాగర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని ఐఇసి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, బాపట్ల జిల్లా వైద్యారోగ్య శాఖ, బాపట్ల జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకత వ్యూహం (దిషా) ఆధ్వర్యంలో స్థానిక గోవిందా అంబికా పరమేశ్వరి జూనియర్ కాలేజ్, మరియు రాయల్ కాలేజ్ కాలేజీ విద్యార్థులతో అనగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ యువత సమాజ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

అభ్యున్నతి, సమాజం ఉన్నతి కోసం నిరంతరం కషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తారని, పిల్లల భవిష్యత్‌పై ఆశలు కలిగి ఉంటారని తెలిపారు. సమాజంలో తల్లిదండ్రులకు మంచి గౌరవం కలిగే విధంగా కృషి చేయాలన్నారు. చిన్న వయసులో చాలామంది మాదకద్రవ్యాలకు ఆకర్షితులై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఇది చాలా బాధాకరమైన విషయమని తెలిపారు. యువత ఉచ్చలవిడిగా మాదకద్రవ్యాలకు బానిసలై విచక్షణ కోల్పోయి విచ్చలవిడి శంగారంలో పాల్గొని హెచ్ఐవి ఎయిడ్స్ భాధితులుగా మారుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి. శ్రీనివాసరావు జి. శ్రీనివాసరావు, హెల్ప్ టిఐ టి. దుర్గాభవాని, టి. లక్ష్మీ తేజస్విని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బాధితులను విచారిస్తున్న డిఎస్పి

అట్రాసిటీ కేసుపై డిఎస్పి విచారణ

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడు మండలం.మేదరమెట్ల గ్రామంలో యానాది సామాజిక వర్గానికి చెందిన బాలికపై ఇవీల గోలి. అజయ్ యాదవ్ అనే యువకుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనపై ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేశారు. దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర బాధితుల తరపున పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో నీలం నాగేంద్ర ఎస్పి, డిఎస్పికి ఫిర్యాదు చేశారు. వారు ఆదేశాల మేరకు పోలీసులు నిందితుడిపై ఎస్సి,ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. చీరాల డిఎస్పి మహమ్మద్ మెయిన్ మంగళవారం మేదరమెట్ల వచ్చి అటాసిటీ మంగళవారం విచారణ జరిపారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. అదే సమయంలో డిఎస్పి మానవత్వాన్ని చాటుకున్నారు. అక్కడే ఉన్న మూగ బాలికను వారి బంధువులను పిలిచి కొద్దిసేపు ఆ బాలికతో సైగల ద్వారానే మాట్లాడారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.ఆ బాలిక పాఠశాలకు వెళ్లడం లేదని తెలిసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. బాలిక పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, పోలీస్ సిబ్బంది, దళిత సంఘాల నాయకులు కాకుమాను రవి, శ్రీనివాసరావు, అక్కయ్య పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి -చిన్నగంజాం

మండల పరిధిలోని కుంకుడు చెట్లపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు నిర్వహించిన పదిమంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.1.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇంకొల్లు సిఐ రమణయ్య తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ పి రమేష్ బాబు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

మూగ బాలికపై దాడి అనుమాషం

ప్రజాశక్తి - చీరాల

కారంచేడు గ్రామానికి చెందిన పొదిలి దేవిక అనే చెవిటి, మూగ రజిక బాలికపై దాడి అనుమాషమని ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స దేవికను ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8న దేవికపై వారి ఇంటి ప్రక్కనే ఉన్న యార్లగడ్డ శ్రీకష్ణ ,అతని భార్య కలసి ఇనుప రాడ్లతో దాడి చేయడం దారుణమన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసిపోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాపట్ల జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, పిడతల అభిషేక్, చుండూరు రమేష్, వీరమల్లు కోటేశ్వరరావు, పీక్కి శ్రీనివాసరెడ్డి, ఆదిశేషు,రామిరెడ్డి, జోసెఫ్,గురన్న,శ్రీనివాసరెడ్డి పాల్గొనడం జరిగింది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-అద్దంకి

ఎడిఎంఒడి ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద సమాచార హక్కు చట్టం-2005 పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు సమాచారం హక్కు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు చట్టాన్ని వినియోగించుకొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది మరియు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -రేపల్లె

దోమల ఉధతిని తగ్గించాలంటే ప్రజలు తమ ఇంటి ఆవరణతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. ఇళ్ల లెట్రిన్ గొట్టాలకు మున్సిపల్ ప్రజరోగ్య సిబ్బంది నైలాన్ నెట్స్ కట్టే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమాని తమ లెట్రిన్ పైపులకు నైలాన్ నెట్ (మెష్)ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా దోమల ఉత్పత్తిని తగ్గించవచ్చునని తెలిపారు. లెట్రిన్ పైపులకు నైలాన్ నెట్ (మెష్) కట్టటం వలన దోమలు లెట్రిన్ లోపలికి వెళ్లి గుడ్లు పెట్టే అవకాశం ఉండదన్నారు. లెట్రిన్ లోపల ఉన్న దోమలు బయటకు రాకుండా చనిపోతాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఇంటి లెట్రిన్ గొట్టాలకు మెష్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటేషన్ సెక్రటరీలు ఎం.సురేంద్ర కుమార్, వి. పవన్ కుమార్, కె.మహేష్, బి.కళ్యాణి, జి. వందన ప్రియదర్శిని, ఎ.జ్యోత్స్న, కె. నాగ జ్యోతి పాల్గొన్నారు.


రక్తం దానం చేస్తున్న దాత

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి- అద్దంకి : అద్దంకి మండలం శింగరకొండ గ్రామానికి చెందిన మల్లవరపు భవాని అనే గర్భిణి రక్తహీనతతో బాధపడుతోంది. ఆమెకు అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరమని తెలిపారు. దీంతో భవాని కుటుంబ సభ్యులు రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావును సంప్రదించారు. స్పందించిన మురళీ సుధాకరరావు నాగులపాడు రోడ్డులో నివాసముంటున్న వేముల జయరాంను ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఇది మురళీ సుధాకరరావు ప్రోత్సహించిన 456 వ రక్త దానం. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీ సుధాకరరావు, రక్త దాత జయరాంను రోటరీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అభినందించారు.

గ్రంథాలయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకిలోని కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ నిర్వాహకుడు డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రంథాలయ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగానాథన్ జయంతిని పురస్కరించుకుని ఆ కారక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు శివప్రసాద్ విద్యార్థులకు, అధ్యాపకులకు, గ్రంథాలయ వనరుల గురించి వివరించారు. కళాశాల వైస్ పిన్సిపల్ ఎంవి.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో మారుతున్న సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా సాధనాలను సమకూర్చుకుని సమాచార నిర్వహణలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డిప్యూటీ ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి- యద్దనపూడి

మండల పరిధిలోని పోలూరు, అనంతవరం గ్రామాలలో డిప్యూటీ ఎంపిడిఒ కష్ణ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న సమిత్వ సర్వే, జ్వరాలపై ఇంటింటి సర్వేను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల కారణంగా సీజనల్ వ్యాధులకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫీవర్ సర్వేలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బందిని అడిగి ఇతర అనారోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుప్పలపూడి మోహన్ బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యశ్వంత్, సచివాలయ సిబ్బంది భారతి, స్వాతి, ఎఎన్ఎం షకీలా భాను, ఆశా వర్కర్లు సుబ్బాయమ్మ,,అనిత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వ్యవసాయం గురించి తెలియని వారు ధర్నాలు చేయడం సిగ్గుచేటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వేమూరు

ఎంత మంది రైతులు ఉన్నారు. ఇక్కడ ఏయేయే పంటలు పండుతాయనే విషయం కూడా తెలియని వారు ధర్నాలు చేయటం సిగ్గుచేటని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. అమర్తలూరు మండలం, కూచిపూడి లాకులు దగ్గర ఇరిగేషన్ మరియు డ్రైనేజీ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, రైతులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం ఎక్కడా రైతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రైతు సమస్యలపై పట్టించుకునే పరిష్కరించేది తెలుగుదేశం ప్రభుత్వమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, భాను గంగాధర్, ఇరిగేషన్ మరియు డ్రైనేజీ అధికారులు, వేమూరు నియోజకవర్గం లోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చీరాలలో కుండపోత వర్షం..

ప్రజాశక్తి - చీరాల

చీరాల మంగళవారం కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన కుండపోత వర్షానికి నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు కూడా నీట మునిగాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మసీదు సెంటర్ రోడ్డు, ముక్కోణపు పార్క్, మున్సిపల్ పార్క్ రోడ్డు లాంటి రద్దీ ప్రాంతాల్లో రహదారులపై మోకాలి లోతున నీరు నిలిచింది.పలుచోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని ప్రజలు చెబుతున్నారు.


చిన్నపిల్లల పార్క్ ఎదుట రహదారిపై నిలిచిన నీరు

నులిపురుగులను నులిమేద్దాం

ప్రజాశక్తి- పంగులూరు

ఆరోగ్యవంతమైన పిల్లలకోసం నులిపురుగులను నలిమేద్దామని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ కె.శివ చెన్నయ్య తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ చెన్నయ్య మాట్లాడుతూ పిల్లలు, కిషోర్ బాలకల కడుపులో నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని తెలిపారు. తహశీల్దారు సింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం నులిపురుగుల నివారణను ఓ పెద్ద కార్యక్రమంగా తీసుకున్నట్లు తెలిపారు. అందుకు అందరూ సహకారం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమేపల్లి శ్రీనివాసరావు, ఎంఇఒ జి. వీరాంజనేయులు, హెల్త్ ఎడ్యుకేట్ అనురాధ, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి :డీవార్మింగ్ డే సందర్భంగా స్థానిక కెఆర్కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎంవి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎన్ఎస్ఎస్ సంచాలకులు డి.రాజశేకర్, బోటనీ లెక్చరర్, డాక్టర్ ఎన్.శర్మిలారాణి, ఇంగ్లీషు లెక్చరర్ డాక్టర్ ఎ.అశోక్ కుమార్, జువాలజీ లెక్చరర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆశా వర్కర్లు విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.



అద్దంకిలో మాత్రలు మింగిస్తున్న వైద్యసిబ్బంది

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ప్రాథమిక పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల చేత మధ్యాహ్నం భోజనం తర్వాత నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి ఎన్.శ్రీహర్ష పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 4833 మంది విద్యార్థులకు గానూ 4754 మంది చేత మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పంగులూరులో మాట్లాడుతున్న డాక్టర్ శివచెన్నయ్య

భటప్రోలు : భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మరియు మండల పరిషత్ పాఠశాల (ఎల్ఇ) లలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు గ్రామ పంచాయతీ సర్పంచి ధారా రవి కిరణ్మయి చెన్నయ్య , ఎంపిపి డివి లలిత కుమారి నాగమల్లేశ్వరరావు పాల్గొని చిన్నారులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి బ్యూలా, పాఠశాల కరెస్పాండెంట్ ఎంపి.వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి, పిహెచ్‌సి వైద్యులు సయ్యద్ మెహసినా తాజ్, హెచ్ఎం గుర్రం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల పరిధిలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారి పాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్చూరు ఎడిఎ ప్రవీణ ఆధ్వర్యంలో పత్తి, పెసర, మొక్కజొన్న, శనగ పంటలలో యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ పంటల సాగు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరించారు. పప్పుధాన్యం పంటలలో ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు గురించి వివరించారు. ఎఒ మాట్లాడుతూ కుమారి మొక్కజొన్న సాగులో ఎరువులు వినియోగం, నీటి యాజమాన్యం, చీడ పీడల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఎటిఎం హారిక, విఎఎ సుదర్శన, గ్రామ సర్పంచి అన్నపూర్ణమ్మ, గ్రామ పెద్దలు శేషిరెడ్డి ,దొడ్డా నాగబాబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అమృతలూరు : మండల పరిధిలోని కూచిపూడి , యాడవూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ హేమంత్ భారత్ కుమార్ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడవూరు గ్రామ రెవెన్యూ అధికారి అంకమ్మరావు, వ్యవసాయ విస్తరణ అధికారి మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రవల్లిక , ఉద్యానవన సహాయకులు శివంక ప్రసాద్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు .



కర్లపాలెంలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

భట్టిప్రోలు : మండల పరిధిలోని పెద్దలంక గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఈనెల 15లోపు పంటలకు బీమా నమోదు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు, విఎఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం : రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. మండల పరిధిలోని నల్లమోతువారిపాలెం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌ను ప్రారంభమైనట్లు తెలిపారు. పంటల సాగు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భవాని, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వేటపాలెం

రైతులకు సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలవాలని, అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా చైర్మన్లు, డైరెక్టర్లు పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి సహకార సంఘం చైర్మన్‌గా పల్లపోలు శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా ఏరాసు బసవేశ్వర రావు, పులి తిరుపతిరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కొండయ్యను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. రైతులకు సొసైటీ సేవలు విస్తతంగా సేవలం దించాలన్నారు. నూతన చైర్మన్, డైరెక్టర్లకు ఎమ్మెల్యే కొండయ్య శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారులు మహేంద్ర నాథ్, గౌరీ అమర్నాథ్, పందిళ్ళపల్లి మాజీ ఉపసర్పంచి పోలకం చంద్రశేఖర్ పాల్గొన్నారు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- సిసి పుటేజీ ఆధారంగా ఆచూకీ కనుగొన్న పోలీసులు

ప్రజాశక్తి - వేటపాలెం

ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు అదశ్యమయ్యారు ఈ ఘటన మండల పరిధిలోని వేటపాలెంలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి అందిన వివరాల ప్రకారం... స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు మంచి మంచి స్నేహితులు. రోజూలాగే సోమవారం తాము కళాశాలకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లారు. చీకటి పడిన తర్వాత కూడా వారు ఇంటికి రాలేదు. దీంతోకుటుంబ సభ్యుల ఆందోళనకు గురయ్యారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు స్థానిక కళాశాలలో ఆరా తీశారు అనుమానితులను అదుపులో తీసుకొని విచారించారు సిసి కెమెరాల పుటేజ్ లను పరిశీలించి విద్యార్థులు వెళ్లిన దారిని కనుగొన్నారు. అనంతరం గుంటూరులో ఉన్నట్లుగా గుర్తించి అక్కడకు వెళ్లి వారిని తీసుకొచ్చారు. ఈ ఘటనపై పోలీసులు ద్వారా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి రేపల్లె

స్థానిక శారద ఐటిఐ కాలేజీలో మంగళశారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు 365 మంది హాజరు కాగా 263 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ బడుగు జ్యోత్స్న తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ జాబ్ మేళా లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయిామెంట్ అండ్ ట్రైనింగ్ జిల్లా అధికారి హారిక, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరపున హరీష్ , రేపల్లె శారద ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ బడుగు జ్యోత్స్న , ప్లేస్మెంట్ ఆఫీసర్ మండే ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకటనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్యామ్ సుధాకర్ , ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పరిశా వెంకటేశ్వరరావు, రేపల్లె మార్కెట్ మార్డు చైర్మన్ మత్తి భాస్కర రావు, విశ్రాంత సబ్ ఇన్స్పెక్టర్ చెన్ను నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

14న ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 14న ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి స్మారక ఉపకార వేతన ప్రదానోత్సవం మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతులమీదుగా నిర్వహించనున్నట్లు విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ మంగళవారం తెలియజేశారు. డాక్టర్ ధూళిపాళ్ల షర్మిల ప్రియాంక సౌజన్యంతో 10వ తరగతిలో ఉత్తీర్ణులై యోగ్యత కలిగిన విద్యార్థుల 30 మంది విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం రూ.3 లక్షలు బహుకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. జె. పంగులూరు, ఇంకొల్లు, అద్దంకి మండలాలకు చెందిన విద్యార్థులకు జనవరి 5న ప్రతిభా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. వీరికి 2025-27 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుకొనేందుకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి -వేటపాలెం

మండల పరిధిలో ఎస్‌హెచ్ జి గ్రూపులకు వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం పెరటి కోళ్లు పంపిణీ చేశారు. యూనిట్ ధర రూ.5000 వంతున 60 యూనిట్ లకు మూడు లక్షల విలువైన పెరటి కోళ్ల ఎంపిడిఒ రాజేష్ బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం అంజి బాబు, క్లస్టర్ సిసిలు విజయలక్ష్మి, చిన్నయ్య, అనురాధ, విఒఎలు, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు

పట్టెం కోటేశ్వరమ్మకు నివాళి

ప్రజాశక్తి- భట్టిప్రోలు

స్థానిక టిఎం.రావు ఉన్నత పాఠశాలలో పట్టెం కోటేశ్వరమ్మ 21వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కోటేశ్వరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పట్టెం కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె డాక్టర్ పాపోలు రమాదేవి సౌజన్యంతో కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం 2014లో పాఠశాలలో భోజనశాల ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, పాఠశాల అభివద్ధి కమిటీ చైర్మన్ అత్తోట సుగుణ కుమారి, రమా సంతాన సాఫల్య కేంద్రం అధినేత పాపోలు రమాదేవి , మురళీధరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, లక్ష్మీపార్వతి, సత్య, రత్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు వేగవంతం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏపీఎన్ఆర్ఈజీఎస్ పనుల కింద మండలాలలో మిగిలి ఉన్న 46 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఎంపీడీవోలకు సూచించారు. పనులకు సంబంధించి లేబర్ బడ్జెట్ వినియోగంపై వారికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయకపోవడం గల కారణాలపై ఆయన ఎంపీడీవోలను ఆరా తీశారు. ఎంపీడీవోలకు ఇచ్చిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు.ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడంలో ముందు వరుసలో ఉన్న ఎంపీడీవోలకు ఆగస్టు 15వ తేదీన ప్రశంస పత్రాలు అందజేసేందుకు వారి పేర్లను ప్రతిపాదించాలని డ్వామా పీడికి తెలిపారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులకు సంబంధించి జాబ్ కార్డుల జారీ పై ఆరా తీశారు. మండలాల్లో దిగువ స్థాయి కుటుంబాలను గుర్తించి వారికి జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. జాబ్ కార్డు లేకపోవడం వలన వారు పొందవలసిన ప్రయోజనాలను పొందలేకపోతున్నారన్నారు. జిల్లాలో డెంగ్యూ జ్వరాల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో డెంగ్యూ జ్వరాల నమోదుపై వైద్యాధికారులను ఆయన ఆరా తీశారు. గడిచిన రెండు రోజుల్లో కొల్లూరు మండలంలో పెద్దలంక, చింతలలంక గ్రామాలలో 2 కేసులు, ఈదుపల్లి, యాజలిలో ఒక్కొక్క కేసు నమోదయిందని వైద్యాధికారులు జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. డెంగ్యూ జ్వరం వచ్చిన వారికి ఇస్తున్న వైద్యంపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో టైఫాయిడ్ జ్వరాలు నమోదవుతున్నాయని, టైఫాయిడ్ జ్వరాలు సోకడానికి గల కారణం త్రాగునీటి కలుషితమే కారణమని జిల్లా కలెక్టర్ మురళి తెలిపారు. త్రాగునీటి సరఫరా లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడి విజయలక్ష్మి, డిపిఓ ప్రభాకర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, పంచాయతీరాజ్ ఈఈ వేణుగోపాల్ రెడ్డి,బాపట్ల డిఎల్డిఓ విజయలక్ష్మి, చీరాల డిఎల్డిఓ పద్మావతి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ పీఎం మాధవి, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై కనీస అవగాహన కోసం..

15న ఒంగోలులో సదస్సు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న చుండూరి రంగారావు

భారత రాజ్యాంగంపై పౌరుల్లో కనీస అవగాహన పెంపొందించడం కోసం ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15న ఒంగోలు ఆచార్య రంగా భవన్‌లో సదస్సు, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగనుంది. ఈ వివరాలను వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. రంగారావు మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పౌరులకు తమ హక్కులపై అవగాహన పెంపొందిస్తే, ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ ఉద్యోగులను ప్రశ్నించే పరిస్థితి వస్తుందనే భయంతోనే దీనిని విస్మరించారని అన్నారు. రాజ్యాంగ పీఠికలోని సార్వభౌమ, సర్వశ్రద్ధాక, లౌకిక, సామ్యవాద విలువలు ప్రతి పౌరుడు అర్థం చేసుకోవాలనీ, సమానత్వం, సౌభ్రాతత్వం, సత్యనిష్ఠతోనే దేశ అభివద్ధి సాధ్యమని తెలిపారు. మార్చి నుంచి జిల్లాలోని 100 పైచిలుకు పాఠశాలలు, 16 జూనియర్ కళాశాలలు, 3 డిగ్రీ కళాశాలల్లో రాజ్యాంగ అవగాహనపై వక్తృత్వ పోటీలు నిర్వహించామని, జూలై 20-26 వరకు సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు పూర్తయ్యాయని చెప్పారు. ఈ నెల 15న జరిగే సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ వ్యవసాయశాఖ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, జాతీయ సమాచార హక్కుల కమిషన్ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో ఒపిడిఆర్ రాష్ట్ర నాయకులు చావలి సుధాకరరావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పెరయ్య, రిటైర్డ్ హెడ్ మాస్టర్ డి వెంకటేశ్వర్లు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, బహుజన ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకులు ఎంఎ సలార్, నక్కా అయ్యన్న, చల్లా సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ

కలెక్టర్లకు సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాజముద్రతో తయారు చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం అన్నదాత సుఖీభవ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, కాస్ట్ సుమోటో డ్రైవ్, డిసిప్లినరీ కేసులకు సంబంధించి ఎంక్వయిరీ పెండేన్సీ, జాయింట్ ఎల్పీఎం సమస్యకు పరిష్కారం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాల్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.

రోజుకు 8 గంటలే పనిచేయాలి

- కార్మికుల హక్కుల సంరక్షణ బాధ్యత అధికారులదే..
- కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'కార్మికులు శ్రమ దోపిడీకి గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.. పని దినాలలో ఒక రోజుకు ఎనిమిది గంటలే పని చేయాల్సి ఉంది.. 8 గంటల పని దినాలు పక్కాగా అమలు జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి.. వారానికి ఒక సెలవు తప్పనిసరిగా ఉండాలి. పండుగ దినాలు, సెలవు దినాలను కార్మికులకు వర్తింపజేయాలి.. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల సంరక్షణ బాధ్యత అధికారులదే..' అని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలపై పరిశ్రమల యాజమాన్యం, అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశం నిర్వహించారు. కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. సంక్షేమ పథకాలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో చేర్చాలన్నారు. మన రాష్ట్రంలోని కార్మికులు, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు విధిగా ఈ శ్రమ్ కార్డులు జారీ చేయాలన్నారు. ఏ పరిశ్రమలోనైనా కార్మికుడిగా పని చేస్తుంటే వారిని తప్పనిసరిగా పిఎఫ్, ఈఎస్ఐలో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పరిశ్రమల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్మికులలో ముఠా నాయకులను చైతన్యపరిచి, పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ త్రినాథ్, డిప్యూటీ కమిషనర్ గాయత్రిదేవి, సహాయ కార్మిక శాఖ కమిషనర్ వెంకట శివప్రసాద్, సహాయ కార్మిక శాఖ అధికారి వి.సాయిజ్యోతి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ రామకష్ణ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో భారీ వర్షాల హెచ్చరికలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి..
- కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈ నెల 14, 15 తేదీలలో భారీ వర్షాల హెచ్చరికలు వచ్చాయని, ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. విపత్తు నిర్వహణ, పర్యవేక్షణపై ఆర్డీవోలతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలతో జలమయం అయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ చెప్పారు. భారీ వర్షాలకు రూపొందించిన ప్రణాళిక సమర్థంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను వస్తే ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి 2.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నందున అధికారులు అప్రమత్తం కావాలన్నారు. మొదటి హెచ్చరిక వెలువడనుందన్నారు. ఈ నేపథ్యంలో వరద నీరు 4 లక్షల క్యూసెక్కుల కంటే మరింత పెరిగే అవకాశం ఉందని రివర్ కన్సర్వేటర్ అధికారులు నివేదికలు వచ్చాయన్నారు. అధికారులు మందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికలతో మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ చెప్పారు. ముందుగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గ్యాస్ సిలిండర్లు, వాహనాలు, జనరేటర్లు, ప్రోక్లైన్ యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, రివర్ కన్సర్వేటర్ కార్యనిర్వాహక ఇంజనీర్ రవికిరణ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' కోసం

212 ఆర్టీసీ బస్సులు

- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం..
- రద్దీ మార్గాల్లో అదనపు బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభించనుంది. ఈ పథకం ద్వారా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు తగిన గుర్తింపు కార్డుతో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

బాపట్ల జిల్లాలో చీరాల, బాపట్ల, రేపల్లె, అద్దంకిలో ఆర్‌టిసి డిపోలు ఉండగా ఈ నాలుగు డిపోల్లోను అన్ని రకాల బస్సులు 253 వరకు ఉన్నాయి. రాష్ట్రంలో ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసే అవకాశం ఉండగా బాపట్ల జిల్లాలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు క్యాటగిరీలకు సంబంధించిన బస్సులు 212 వరకు ఉన్నాయి. వీటిలో ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాలో ఆర్‌టిసి బస్సుల్లో రోజువారీ సరాసరి లెక్కల ప్రకారం 75 వేల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా వేశారు. వీరిలో 30 వేల వరకు మహిళా ప్రయాణికులు ఉంటారని అంచనా. ఈ నెల 15 నుంచి ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఈ సంఖ్య మరో 20 వేల వరకు పెరుగుతుందని భావిస్తున్నారు. అంటే జిల్లాలో మహిళా ప్రయాణికుల సంఖ్య 50 వేల వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. పెరగనున్న మహిళా ప్రయాణికుల అవసరాల మేరకు ఇప్పటి వరకు బడి సర్వీసుల కోసం ఉదయం, సాయంత్రం మాత్రమే తిరుగుతున్న బస్సు సర్వీసులను రద్దీ మార్గాల్లో అదనపు సర్వీసుల కింద తిప్పనున్నారు. వీటితో పాటు మరమ్మతుల్లో ఉన్న బస్సులు, స్పేర్ బస్సులను కూడా రోడ్లపైకి తేనున్నారు. చీరాల-ఒంగోలు మధ్య తిరిగే బైపాస్ రైడర్లు ఎక్స్‌ప్రెస్ బస్సులు అయినందున మహిళలు ఉచితంగా వీటిలో ప్రయాణించవచ్చు. నాన్‌స్టాప్ బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణం ఉండదు.

కావాల్సిన గుర్తింపు పత్రాలివీ..

మహిళలు బస్సులలో ఉచితంగా ప్రయాణించాలంటే గుర్తింపు కార్డులు తప్పనిసరి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తప్పనిసరి. దీని ప్రకారం ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు వంటివి చూపించి మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యం పొందవచ్చు. ఈ పథకం కింద రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వీలుంది. ఇందులో భాగంగా మహిళలకు జీరో ఫేర్ టికెట్లు జారీ చేస్తారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలు అందరికీ ఉచిత బస్సు పథకం వర్తిస్తుంది.

సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం..

డి.సామ్రాజ్యం, జిల్లా ప్రజా రవాణా అధికారి, బాపట్ల జిల్లా

మహిళలకు 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆగస్టు 15 నుంచి అమలు కానున్న నేపథ్యంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆర్‌టిసి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. పథకం ప్రారంభం అయిన తొలి రోజుల్లో మహిళల రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్నాం. ఈ మేరకు వారి పట్ల ఎలా మర్యాదగా వ్యవహరించాలి. టిక్కెట్‌లు వేగంగా జారీ చేసే విధానం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ప్రతిరోజూ ఉదయాన్నే కూరగాయలు, పండ్లు, పాలు విక్రయాల కోసం మహిళలు ఇతర ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణిస్తారు. ఈ మేరకు రద్దీ వేళలు, మార్గాల్లో ఆర్‌టిసి సర్వీసులు నడిపే కృషి జరుగుతోంది.